విశ్వనాథ వారి



# ముద్దు వడ్డన్లు-2

సంకలనకర్త: డా. వెలిచాల కొండలరావు

విశ్వనాథ సాహిత్య పీఠం ప్రచురణ

విశ్వనాథవారి

# ముద్దువడ్డన్లు–2

సంకలనకర్త : డా. వెలిచాల కొండలరావు

విశ్వనాథ సాహిత్య పీఠం ప్రచురణ

విశ్వనాథ వారి

# ముద్దువడ్డన్లు–2

సంకలనకర్త : డా. వెలిచాల కొండలరావు

© 2004 విశ్వనాథ సాహిత్య పీఠం ప్రచురణ

For Copies **SISTER NIVEDITA FOUNDATION**
11-4-654/3, Red Hills, Lakki-ka-pul, Hyderabad - 500 004.
Ph : 23396358 / 23305134

**M/S. VISALANDHRA BOOK HOUSE**
4-1-435, Bank Street, Hyderabad - 500 001.
and all its Branches in A.P.

Rs. : 50/-

Printed at **PARTHASARATHI PRINTERS**
Nallakunta, Hyderabad - 44.
Ph : 55108206 / 56608206

# ముందుమాట

"సత్యనారాయణగారు ఎప్పుడూ సాధువే! కాకపోతే, ఎవరైనా అన్యాయంగా గిల్లినప్పుడే ఆయనకు కోపం వస్తుంది. (ఆ గిల్లడం వ్రాతలతో కావచ్చు, చేతులతో కావచ్చు, మాటలతో కావచ్చు). అప్పుడే తిడతాడు. ఆ తిట్టడం మాత్రం మహా ఆనందంగా ఉంటుంది. (కోపానికి బదులు గిలిగింతలు పెట్టినట్టు). అందుకనే చాలా మంది కావాలని గిల్లి మరీ తిట్టించుకొనేవారు." (లక్ష్మణ యతీంద్రులు)

Satireలో, sarcasmలో, సున్నితమైన, సుకుమారమైన మందలింపులలో, ఎద్దేవాలలో సత్యనారాయణగారిది ఆరితేరిన చేయి. అతడి కోపం పిల్లవాడిపై తల్లి కోపం లాంటిది. ప్రేమతో కూడినదే కాని ద్వేషంతో, అసూయతో కూడినది కాదు. అందుకే సత్యనారాయణగారంటే అందరికీ అప్పటికీ ఇప్పటికీ అంత ప్రేమ.

సత్యనారాయణగారికి అప్రతిభావంతులంటే, చదవకుండా, ఎదగకుండా, అర్థం చేసికోకుండా, అర్థంచేసికొనే తహతూ తర్ఫీయతూ లేకుండా మాట్లాడేవారు, విమర్శలకు పూనుకునే వారంటే తెగకోపముండేడిది. చెడా బడా వాడిని వాడెంత వాడైనా చీదరతో, చివాట్లతో చెంపలు వాయించినట్లు వాయించేవారు. అయినా వారు వాటిని తిట్లుగా కాక దీవెనలుగానే భావించేవారు ఏ కొందరో తప్ప. తిట్టి కూడా భళే అని అనిపించుకున్నవారు బహుశా వారొకరేనేమో! బహుశా సాహిత్యపరమైన శత్రువులే కాని వ్యక్తిగతమైన శత్రువులు లేని అజాతశత్రువు వారొకరేనేమో!

ఈ రోజుల్లో హాస్యానికన్నా అపహాస్యానికి గిరాకీ ఎక్కువైపోయింది, చమత్కారానికన్నా కారానికి, ఛలోక్తికన్నా పర్షోక్తికి. సున్నితమైన సుకుమారమైన, అందమైన, అద్భుతమైన, ఆశ్చర్యకరమైన మాటకాని, మాటకుమాటకాని, ఔచిత్యమైన చిరుచిటపటలకేకాని ఆస్కారం చాలా తక్కువైపోయింది. ఇంకా చెప్పాలంటే, మాటల్లో, చేతల్లో హుందాతనం తక్కువైపోయి వెకిలితనం, వెర్రిబాగుల వాగుడు ఎక్కువైపోయింది. దాని వలన మనుషుల మధ్యా మనుషుల మధ్యా ఉండవలసిన సహృద్భావం తగ్గి ముభావం, ముక్కోపి భావం పెరిగిపోతోంది.

"మీ సాహిత్య జీవితంలో మరపురాని సంఘటనలు చెప్పండి" అని శ్రీశ్రీని ఎవరో అడిగారట ఒక తూరి. దానికి వారు

"ఒకటి - మహాప్రస్థానం గీతాన్ని భారతి మాసపత్రిక తిరగ్గొట్టడం.

రెండు - కవితా! ఓ కవితా! అనే గీతం చదువుతూ ఉంటే విశ్వనాథ సత్యనారాయణగారు అశ్రుసిక్త నేత్రులు కావడం" అని అన్నారట.

అలాగే, విశ్వనాథ సత్యనారాయణ గారి మరణానంతరం డా. సి. నారాయణ రెడ్డిగారిని ఎవరో ఒక విమర్శకుడు "మీ అభిప్రాయాలకి విశ్వనాథ అభిప్రాయాలకి పడదుగదా, మరి మీరు ఆయన దివంగతులైనప్పుడు "హిమాలయ పర్వత శిఖరం విరిగి పడిపోయింది" అన్నారట, అట్లా ఎందుకన్నారు." అని అడిగితే "చచ్చిపోయిన వాళ్ళని సంస్మరించేటప్పుడు తిట్టే సంస్కారం కాదు నాది. ఆయన నిజంగా తెలుగు సాహిత్యంలో హిమాలయ పర్వత శిఖరం లాంటి వాడే. ఆ మాటే అన్నాను" అని అన్నారట.

అదీ సంస్కారమంటే, సహృదయతంటే, సాహిత్య ఔదార్యతంటే, స్నేహశీలతంటే, నిజమైన నిష్పక్షపాత అవగాహనంటే. ఈ రోజుల్లో వలె శ్రీనాథులమని చెప్పుకొంటూ కోతుల వలె కీచులాడు కోవటం, ప్రతి సాహిత్యపరమైన విబేధాన్ని వ్యక్తిగత వివాదంగా, వ్యతిరేకంగా తీసికొని ముఠాలు ముఠాలుగా రాజకీయ వాదుల్లా విడిపోవడం కాదు, విరుద్ధాలు పెంచుకోవడం కాదు.

బహుశా, సాహిత్యంలో, మరీ కవిత్వంలో, తెనాలి రామకృష్ణుని తదుపరి గద్యంలోనైనా, పద్యంలోనైనా ఛలోక్తి, చతురత, చమత్కారాల చెమక్కులు విస్తృతంగా విసిరిన వారు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణగారు తప్ప మరొకరు మనకు కనిపించరేమో?అంతటి హుందాతనం ఉన్నవారు, అంతటి సమయస్ఫూర్తి,

సందర్భ ఔచిత్యం కలవారు, ఏరికోరి ఏర్పడకుండా ఎగతాళి చేయగలవారు, నొప్పించకుండా ఒప్పించగలిగేవారు మరొకరు లేరేమో? పీఠికలు వ్రాసినా, వ్యాసాలు వ్రాసినా, కథలు వ్రాసినా, నవలలు వ్రాసినా, నాటకాలు వ్రాసినా, కవితలు వ్రాసినా, ఉపన్యాసాలిచ్చినా, పాఠాలు చెప్పినా, కమ్మకమ్మని హుషారు మాటలు చెబుతూ చిన్న చిన్న సంభాషణ వాక్యాల్లాంటి వాక్యాలతో నవ్వుతూ నవ్విస్తూ, సరదాగా సంబరంగా చివాట్లు పెడుతూకూడా చివుక్కుమనిపించని వారు ఒక్క విశ్వనాథ తప్ప గత రెండు శతాబ్దాలలో మనకెవ్వరూ ఎక్కడా కనిపించరేమో?

విశ్వనాథ అభిప్రాయాలతో ఏకీభవించని వారుకూడా విశ్వనాథగారి ప్రతిభను కొనియాడనివారు లేరు. అదీ ఆయన వ్యక్తిత్వం, అదీ ఆయన పర్సనాలిటీ, అదీ ఆయన గొప్పతనం, ఆయన సర్వకాలీన సార్వత్రిక acceptability.

జీవితాన్ని క్షుణ్ణంగా అన్ని దృక్కోణాలనుండి పరికించి, అనుభవించి, ఆకళింపుచేసికొని, జీవిత పరమార్థంతో దానిని జోడించి, తాత్త్విక దార్శనిక దృష్టియను సానపై దానిని సానబట్టి సాహిత్య సారస్వత కృషి చేసిన మహామనిషి, కళలు సృష్టించడం కలలుకనడం తప్ప కల్లాకపటమెరుగని కమనీయ హృదయుడు. నిజమైన సత్యాగ్రహి, నిష్కలంకి, నిరాడంబరి, నిత్యసత్యజీవి. లేకపోతే ఎలా అనగలడు సాక్ష్యాత్తు రామున్నే దాదాపు కళ్ళారా చూచానని? ఎలా వ్రాయగలడలా అంత కమ్మని రామాయణాన్ని, కల్పవృక్షాన్ని, కామధేనువుని?

విశ్వనాథ సాహిత్యంలో, వారి పీఠికలలో, ఉపన్యాసాలలో, ఉత్తరాలలో వర్ణనతో పాటు వ్యంగ్యానిది, Satireది, sarcasmది, Humorది, ironyది ఎంతో కొంత భాగం వృత్తానికి ఒక మేలి ముసుగులా అచటచటా ప్రతిబింబిస్తూ పదార్థానికి పసందైన పదును పెడుతుంది. ఇది సంఘం ఒక విధంగా కాక మరొక విధంగా పోవడాన్ని సూచిస్తుంది. వ్యక్తులు, సంఘాలు, దేశాలు ఎలా పెడదారిలో, పెంకెదారిలో పోతున్నాయో, అలా ఎందుకు పోగూడదో వ్యాఖ్యానిస్తుంది.

విశ్వనాథకు చెందిన వర్ణనలు, అలంకారాలు, సమాసాలు ఎంత ప్రసిద్ధమో, వారి సుతిమెత్తని సూదిపోటు మాటలు కూడా అంతే ప్రసిద్ధము. Bernard Show, Oscar Wilde, Gold Smith, Voltaire వారిలా సత్యనారాయణగారికి ఎలా భావనవ్వులతో, భాషామువ్వలతో నాట్యం చేయించాలో తెలుసు. "విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు" లో హాస్యంతో, వెక్కిరింపుతో, దెప్పడంతో, ఎద్దేవాచేయడంతో విశ్వనాథవారు హ్యూమర్‌లో ఎంతపై స్థాయికి ఎంత హుందాగా పోగలరో మనకు విదితమవుతుంది. వారి "చిన్నకథలు"లో మనం వాటిని చదువుతూ చదువుతూ మనమే నవ్వుకునే ఎన్నెన్నో సన్నివేశాలు మనకు కనబడతాయి. "వేయిపడగలు"లో తదితర రచనలలో కూడా అచటచటా వారి హాస్యప్రతిభ కనబడుతూనే ఉంటుంది.

విశ్వనాథ సత్యనారాయణగారి పీఠికలు, ఉపన్యాసాలు, వ్యాసాలు, తదితర రచనలనుండి, ప్రత్యేకంగా "విష్ణుశర్మ ఇంగ్లీషు చదువు", "పులుల సత్యాగ్రహం", "చిన్నకథల" నుండి సేకరించిన కొన్ని ముచ్చటైన ఛలోక్తులు, చమత్కారాలు, వ్యంగ్యాలు, అధిక్షేపాత్మక మాటలు దిగువ సుదహరిస్తున్నాను, మరికొన్ని మరొక పుస్తకంలో పొందుపరుస్తాను.

*****

విద్యార్థులారా! నాయందు మీకిట్టి కరుణకల్గుట నేను చేసికొన్న ఒక పురాసుకృతము పండుట. ఉద్యోగములేక తంటాలు పడువానికి హఠాత్తుగా నొక ఉద్యోగము ప్రాప్తించెను, పేద వానికి బంగారు నాణెముల బిందె దొరకును. నా వంటివాని కిట్టి సన్మానము జరుగును. ఇవి కారణములేనివి. ఊహింపరానివి. ఇది మన పూర్వులు చెప్పిన కర్మ సిద్ధాంతముచేతనే సమాధానము చెప్పదగినది.

218

ఏ భాషయొక్క తత్వమాభాషది. భాష నేర్చుకొనుటలో నున్న కష్టము నుడికారము నేర్చుకొనుటలో నున్నది. నుడికారము పట్టుపడుట మిక్కిలి కష్టము. మనస్సు, శ్రద్ధ, కాలము సంపూర్ణముగ వినియోగించినగాని ఆ నుడికారము పట్టుపడదు. ఇట్లు వినియోగించుట, మాతృభాషలో వినియోగించుటయా, పరభాషకొఱకు వినియోగించుటయా? యన్నది ప్రశ్న.

219

అలంకారశాస్త్రము కవిత్వమునకు రాజమార్గము వంటిది. వ్యాకరణము మిత్రుని వంటిది. గాన వీటినన్నిటిని సులభసాధ్యములు గావించుకొని ప్రాచీన కవుల మార్గములను బాగుగా గుర్తెరిగిన వాడు గాని ఎవడునూ కవి కానేరడని నాయభిప్రాయం. అసలాంధ్రమున కవి కావలెననిన, సంస్కృత భాషాజ్ఞానముండి తీరవలె ననెడివారిలో నేనొకడను. నవ్యకవులలో కొందరు పాండిత్యప్రకర్ష యెక్కువైన కవిత్వ స్రవంతులింకి పోవునని యందురు. ప్రకర్ష యెక్కువైన అట్లు జరుగునేమో గాని, పాండిత్యము వలన గల్గు విశేష విషయపరిజ్ఞానము వలన నష్టమేమి?

220

కొందరు అందరకూ అర్థమయ్యే రీతిని కవిత్వము వ్రాయవలెనని అనుచుందురు. అందరనిన ఎవరు? ఆంధ్రదేశములోని ఆబాలగోపాల మనియా వీరిభావము. ఒక సామాన్యవాక్యము మాట్లాడిననూ, అందరూ అర్థము చేసికోగలరా? పరీక్షించి చూచినచో చదువుకొనిన వారమనుకొనువారికి గల పదజాలము గూడ అత్యల్పమైనపుడు, సామాన్యుల పదజాలమెంత? ఇట్లని నేననినచో సామాన్య ప్రజలపై నీకాదరణ లేదని యందురు. నేను పురుషోత్తమ సిద్ధాంతము నంగీకరించువాడను, ఎట్లనుకొనిననూ ఫరవాలేదు.

221

ఆంధ్రదేశంలో నాటకాలు అధోగతి పాలయిపోయినవి. రిహార్సల్సు లేకుండా ఒక నటుణ్ణి ఇంకొక నటుడు ఎరగకుండా నాటకాలు ఆడుతున్నారు. పాశ్చాత్య దేశాలలో ఒక్కొక్క నాటకము రెండు వందల సార్లయినా రిహార్సల్ చేస్తారు. ఆంధ్ర దేశములో నాటకము ఆడబోయే ముందు ఆ రోజు సాయంత్రమయినా ఒక్కసారి నల్గురు నటులు సంప్రదించనయినా సంప్రదించుకోరు.

222

సంస్కృతము తెలిసిన వారినే తెలుగు పండితులుగా నియమించడం మంచిది. ప్రస్తుతం నూటికి ముప్పది యైదు మార్కులు వచ్చిన వారిని తెలుగు పండితులుగా నియమించడం, వారివద్ద నున్న శిష్యులు నూటికి ముప్పదియైది వచ్చి కృతార్థులు కావడంవల్ల విద్యార్థులలో విద్య క్షీణించిపోతోంది.(భాష హరించి పోతోంది)

223

ఉత్సవాలు జరిపించుకోవాలని అగచాట్లు పడేవారికి అవి జరుగవు. వద్దు మొర్రో అనే వారినే ఇవి వెంటాడుతాయి.

224

నిజంగా మా కళాశాల పాలకవర్గం వంటి పాలకవర్గం మరెక్కడా లేదు. అందరూ అమృతహృదయులు. వారికి ఉద్యోగం యివ్వటమే గాని తీసివేయడం తెలియదు. వారి కళాశాలలో మేం చేస్తోన్నది తాబేదారి పనికాదు, రాచరికము.

225

ఎవరి శక్తి ఎల్లా ఉన్నా సమబుద్ధి ఉండాలి . ఒక కూటమి పెట్టి తాను దానికి “హెడ్డు” అయ్యి, తాను ఆంధ్రదేశానికి “హెడ్డు” నంటే ఎల్లా? ముద్రాధికారం కలవారు ఉండాలి.

226

“విష్ణుమూర్తి మామ మామ” అని ఆంధ్రనామ సంగ్రహంలో ఉన్నది. మా దివాకర్ల వెంకటావధాని నన్ను గురువు అన్నాడు. నాకు గురుపుత్రుడాతడు. నాకతడు గురువు. ఆంధ్రంలో మామ మామ అయినది గాని సంస్కృతమైన గురువు పదం గురు గురువవుతుందేమో నాకు తెలియదు. అతడు 116 ఇచ్చాడు. అతనికి నమస్కారాలు ఇవ్వాలో ఆశీర్వచనాలు ఇవ్వాలో తెలియదు. రెండూ ఇస్తాను.

227

యీ మధ్య నన్ను గురించి, ఒక పండితుడు విమర్శన వ్రాస్తూ నా కవిత్వములో దోషాలు జూపిస్తూ గాంధీగారు రాజకీయరంగంలో ఎంత విప్లవద్రోహియో, విశ్వనాథ సత్యనారాయణ కవిగారు సారస్వతంలో అంత విప్లవద్రోహి అన్నాడు. నక్కకు దేవలోకమునకువలె, నాకును



గాంధీగారికిన్నీ సామ్యము లేకపోయినను ఆయన అన్నమాట ఆశీర్వాదముగా ఫలించింది. ఎందుకంటే గాంధీగారు హరిజనోద్ధారకుడు. ఆ విమర్శ వాక్యబలముచేత కాబోలు వెయ్యిమంది హరిజనులున్న యీ సభలో ఒక హరిజనకవికి, నా అధ్యక్షత క్రింద సన్మానము జరుగుతోంది. ఈనాడు చాలా మంచిరోజు.

228

నేను యీ సభలో నిల్చోని మాట్లాడుట నారుమడిలో నిలుచుండి సంగీతము పాడినట్లున్నది. నిజానికి మీ అందరికి వచ్చినంత తెలుగు భాష మాకురాదు. తెలుగు భాష మాట్లాడు భాషవేరు, కవితాభాష వేరు. వేరువేరు అనగా ముద్రలు వేరు. భాష ఒకటే.

229

ఒక విషయాన్ని ఇంగ్లీషులోకి ఎవరయినా అనువదిస్తే దాన్ని చదివి ఆహా ఎంత బాగుంది అంటారు. తెలుగులో వ్రాసిన వాణ్ణి గుర్తించరు. శోచనీయమయిన ఈ స్థితికి కారణమేమిటి? తగినంత మాతృభాషాజ్ఞానం మన రాజకీయవాదులకు లేకపోవడమే.

230

సంస్కృతిహీనం కావడమే మన రాజకీయాలలో గొప్ప లోపం. సాహిత్యాన్ని కూడా రాజకీయాలతో జోడిస్తే సంస్కృతి పూర్ణములవుతాయి. రాజకీయవేత్త సంస్కృతిపరుడు కూడా అయితే ఆంజనేయుడవుతాడు. ఆంజనేయుడు మహాపండితుడు. రాజకీయమూ, సాహిత్యమూ కలిసిపోవాలి.

231

మన ఆధునిక కవిత్వంలో తాత్పర్య భావద్యోతకత కనిపిస్తుంది. అర్థ భావ ద్యోతకత లేదు. ఉదాహరణకు “అగ్నితో తడుపుతున్నాడు.” అనే ఈ ప్రయోగానికి అర్థం వున్నదా అన్నది ప్రశ్న. లేదని శ్రీపాద లక్ష్మీపతి శాస్త్రిగారంటారు. వున్నదని తాతా సుబ్బారాయుడు శాస్త్రిగారంటారు. అర్థం లేకపోయినా తత్ వాక్యద్యోతకత వుంది. ఈ ప్రయోగం నిరర్థక శబ్దంలో ఆర్థతః భావాన్ని కల్పించి కవిత్వంలా భాసింపచేస్తుంది. ఇదీ ఆధునికుల పరిస్థితి.”

232

“ఆర్యులారా, పండితులారా! కొంతమంది తెలుగు మాట్లాడడం సంస్కృతంగా ఉంటుంది. నేను తెలుగు పద్యం వ్రాస్తే సంస్కృతంగా అందరికీ అర్థం ఔతుందనుకుంటాను.”

233

సంపూర్ణమైన కావ్యం ఒక్క రామాయణం. దానిలోని విశేషాలను అల్పజ్ఞుడగు నేను నాకు తెలిసినంతవరకు చెబితేనే ఐదారు దినాలు పడుతుంది. ఇక్కడ ఉన్న పండితులంతా అయితే ఎంత కాలమైనా చెప్పగలరు.

234

అందరికీ కవిత్వం తెలియాలనే వాళ్ళు నా కవిత్వం చదవక్కర్లేదు.

235

మహాకవి సమాసం ఎక్కడ వాడాలో అక్కడ వాడతాడు. అలా వాడకపోతే ఆ లోపం లోపంగా ఉండి పోయి కావ్యానికి అవసరమైన రసపుష్టి కలుగదు. వర్ణనలో సాధారణంగా ప్రతికవీ దీర్ఘ సమాసాలే వాడతాడు. సమాసాలకు దూరంగా ఉండేవాడు నాల్గవరకం కవే. వర్ణనలో గడుసుగా భావమే చెప్పవలె కాని రసానికి స్థానం లేదు.

236

ఒక కూలీవాణ్ణి, రిక్షావాణ్ణి పలుకరించు. వాళ్లదాకా ఎందుకు? వాకిట్లోకి బిచ్చానికి వస్తాడు, నీకు చేయి తీరుబడిగా ఉండదు. నువ్వేదో పనిమీద ఉంటావు. వాడికి బిచ్చమేసి తీరాల్సిందే, వెళ్ళమంటే వాడు వెళ్ళడు. నీకు కోపంవచ్చి వాణ్ణి తిడతావనుకో, వాడు బిచ్చమడిగినంత సేపూ ఎంత వినయం చూపిస్తాడో, నీవు బిచ్చం వేయవని వాడికి తెలిసిన తరువాత, అంత ధార్ష్యం చూపిస్తాడు! ఆ రోజుతో నీకు పరలోకాలు బంద్.

మరీ మా ఊళ్లో అన్నదాన సమాజం ఉంది. దాని తరపున ఒకడు కాషాయగుడ్డలు కట్టుకొని, ఒక కావడివంటిది బుజాన వేసుకొని, గంటలు గణగణ లాడుతూ వస్తాడు. వానికి నీవు బియ్యం పెట్టవనుకో – శతవిధాల పెట్టక తప్పదు – పెట్టకుండా వాణ్ణి ఏదైనా నువ్వను. వాడు నీకన్న జగద్ద్రోహి లేడన్నట్లు మాట్లాడుతాడు. నిన్ను తోటకూరకాడలో పురుగును తీసివేసి నట్లు తీసేస్తాడు. వాడి ఉద్దేశ్యంలో వాడు మనందరికి మోక్ష మిప్పించేందుకు పుట్టాడనుకొంటాడు. వాడు బిచ్చమెందుకు ఎత్తుకుంటాడంటే మనం మోక్షానికి చెడిపోతామేమో నని వాడికి భయం. వాడి భయం ఎంతదూరం పోయిందంటే, మనను బెదిరించో, తిట్టో, లెక్కచేయకుండా మాట్లాడో, మనచేత ధర్మం చేయించితీరాలి, అన్నంత భయం. వాడికి మనమీద ఉన్న జాలి, వాడికి దురహంకారం ఉన్నట్లు అనిపిస్తుంది. (దమయంతీ స్వయంవరం).

237

తెలుగు మాగాణి పల్లెటూరి జీవితంలో శోభ తెలియని వాడికి నా కావ్యసంపద తెలియదు, అక్కర్లేదు.

238

"వలిపేరుకొనిన కొబ్బరినూనే కుదుపలే, సీమంతములయందు చెక్కికొనగ" కంగులలోన అని అన్నప్పుడు 'కంగులు' అంటే ఏమిటో తెలిస్తేనే కాని పద్యం సొగసు తెలియదు. నాకు తెలిసినంత నరకు తెలుగు పలుకుబడి తెలిసిన రచయితలు డజను మంది కంటె



ఎక్కువలేరు. నేను తెలుగు ప్రపంచానికి సవ్రమాట్టును అంటున్నాను.

239

"కల్పవృక్షం" మీరు కోరనిదే ఏమీ ఇవ్వదు. ఆ కోరడంలో కూడా వినయంగా కోరాలి.

240

నేను చాకలివాని బట్టల మడతలకు "కంగులు" అని వాడాను. అది ఎంత మందికి తెలుసు? నేను అనుభవించిన వాణ్ణి. ఆకలితో మాడినవాణ్ణి: అడవులలో తిరిగిన వాణ్ణి. ఏరు ఈదినవాణ్ణి గనుక నాకు తెలుగు జీవితం 95 పాళ్ళు తెలుసు. నాకు తెల్సిన జీవితానుభవ కల్పనలను, సర్వ విద్యలను ఈ "రామాయణ కల్పవృక్షం"లో వ్రాశాను. ఆయా సందర్భాలలో నేను పడిన కష్టం ఇంతా అంతా కాదు. నేను వందల కొలది, వేల కొలది ఉపమానాలు రామాయణంలో వ్రాశాను. పిచ్చికలు ఉదయపు వేళ వడ్లగింజలపై వ్రాలి – ఏదో భయపడి అలా ఎగిరి పోవడాన్ని గూర్చి వ్రాస్తూ "వయస్సు గత్తెలు పచ్చీసు ఆడ్తూ గవ్వలను పందెం విసరివేస్తున్న దాంతో" పోల్చాను... నా హృదయం వేదన పడింది. దాన్ని కల్పవృక్షం అని అన్నది అందుకే...దారిన పోయేవాళ్ళకు అది అర్థం ఇవ్వదు... అమ్మా అని అడిగితే ఇస్తుంది.

241

కావ్యాన్ని అర్థంచేసికోవడం అందరికీ అందుబాటులో ఉండే విషయంకాదు. అది కొందరికి మాత్రమే ఉన్నది. కొందరికసలు ఏదీ అర్థంకాదు. కవిత్వం పూర్వకాలంలో వారికి అర్థమయ్యేది. వారికి తెలుగు తెలుసు. తెలుగు పలుకుబడి తెలుసు. వాక్యనిర్మాణ వైఖరీమర్మం తెలుసు. వాక్యనిర్మాణ వైఖరి బహుచిత్రమైనది, ఈ వైచిత్రిలోని వైశిష్ట్యం తెలియకపోతే ఈ రామాయణం అర్థంకాదు.

242

ఇలాంటి (గడుగ్గాయలు) ఎనమండుగురు కొంపకు వచ్చారంటే నీ అంతు చూచారన్నమాటే. వీళ్ళు రావటంతోటే ఎదో ఫలహారం పెట్టాలి. అది బజారునుంచి కొనుక్కొచ్చామంటే వాళ్ళూరుకోరు. అందులో ఒకడు "ఏమండీ ఇది కిరసనాయిలుతో చేశారా, డాల్డాతోనా?" అని అంటాడు. ఇంకొకడు "అచ్చ ఆవునెయ్యి ఆస్ట్రేలియా నుంచి తెప్పించాడు రా" అంటాడు. ఇదిట్లా వుండగా కాఫీ దగ్గరి కొచ్చేటప్పటికి పేచీలు. ఒకడు నేను కాఫీ త్రాగను. టీ త్రాగుతాను అంటాడు. మరొకడు నాకు పల్చని మజ్జిగలో నిమ్మకాయ పిండి పంచదార వేసి యిమ్మంటాడు. ఒకడికి డికాక్షను ఫిల్టరు చేస్తేగాని బాగుండదు. ఇవన్నీ నాకు తెలుసు. ఈ దిక్కుమాలిన హిందూ దేశంలో పుట్టి అతిథ్యానికి వెనక్కి తియ్యకూడదు. ఇతర

దేశాలలో అయితే వాళ్ళు చక్కని ఆతిథ్యం స్వీకరించి అందరూ తలా రూపాయో అర్థరూపాయో ఇచ్చి పోతారేమో తెలియదు. కొన్ని వర్ణాలవారు పరాయి యింట్లో భోంచేస్తే పీటకింద పదణాలు పెట్టివెళ్ళేవాళ్ళట. (బాణావతి)

243

ఏదైనా అంతరదృష్టి ఉంటే కాని అర్థం కాదు. వ్రాసేవాడు ఎవరికీ అర్దం కాకూడదని వ్రాయడు. పూర్వకావ్యాలలోనూ కొన్ని కొన్ని ఘట్టాలు మాత్రమే అందరికీ అందుబాటులో వున్నాయి. మన మనోవృత్తులను బట్టి మన అభిరుచులుంటవి. పూర్వ కావ్య సాహితీ పరిచయాన్ని బట్టి నాగరికతా ప్రాభవాన్ని బట్టి, సంస్క ృతీ సంప్రదాయాన్ని బట్టి కావ్యగత శోభ వారి వారి కవగతమవుతుంది.

244

నా తరువాత మళ్లీ కొన్ని వందల ఎండ్లకుగానీ ఇట్లా వ్రాసేవాడు పుట్టడు. బహుప్రయత్నం చేసి, నా జీవితానుభవాలను, సర్వస్వాన్ని పిండి రమ్యమైన కల్పనలు చేశాను. అనంతమైన పోకడలు పోయాను. శ్రీ రామచంద్రుని చరణాలపై సర్వస్వమూ అర్పించాను. అయినా నేను వ్రాశానా ఇలా? పరమేశ్వరుడు నా చేత వ్రాయించాడు. వ్రాయరా అంటే వ్రాశాను. మానేయరా అంటే మానేశాను. (ఏమైనా అంటే ఆ పరమేశ్వరున్ననండి నన్నెందుకంటారు?)

245

"సర్వజనులు మెచ్చుకొనుట అంటే ఆ విద్య తెలిసినవాడు మెచ్చుకోవలెనని కాని ఎవడో సంబంధం లేనివాడు మెచ్చుకోవలెనని కాదు."

246

సంస్క ృతం ఎవరు చదవాలి? పరమేశ్వర భావనము చేసే వారు చదవాలి; వేదస్వరూపము ఎరుగగోరినవారు చదవాలి; అందరూ చదవనక్కరలేదు. చదవడానికి అనర్హులని నేనన్ను, అల్పసాధనము వల్ల సాధింపబడే దానికి అధిక సాధనం ఎందుకు? లోక వ్యవహారం కోసం, ఇంకా యితర విషయాల కోసం చాలా దేశభాషలున్నాయి. మూడవ క్లాసు నుంచీ యింగ్లీషు పెట్టాలని మంత్రిగారు చెపితే మనం ఏమి చేయగలుగుతున్నాం?

247

మనలో బ్రహ్మణత్వం తగ్గినట్లే , ఆంగ్లం ద్వారా అభ్యసించే సంస్క ృతం వల్ల సంస్క ృ తత్వం కూడా తగ్గిపోతోంది.

248

మానవుల్లో శరీరక, మానసిక వైవిధ్యము, భేదాలు ఎల్లావున్నాయో కవిత్వము అనే ప్రపంచములో కూడా ఆ విభేదాలున్నాయి. ఆర్థిక శాస్త్రము గాని గణిత శాస్త్రము గాని



అందరికీ తెలుస్తున్నాయా? ఒక్క కవిత్వము మాత్రమే అర్థము గావాలా? (అవి అర్థం కాకపోతే వీటిని వ్రాసిన వారిని తిట్టినట్లు, వాటిని వ్రాసిన వారిని తిట్టరేమిటి)

249

ఆంధ్ర కవిత్వం మొత్తం ధ్వన్యాత్మక సంగీత ప్రధాన లక్షణలక్షితమైనట్టిది. అట్టి సంగీతాన్ని ఇతర భాషలలోకి తీసుకురావడం ఎలా సంభవం? ఇప్పటికే మన కవిత్వ సంపద ఎంతో తరిగిపోయింది. స్వరసంగీత ప్రధానమైన దేశీకవిత్వం ఫణితులు విలుప్తమైపోయాయి. ఇది దేశానికి తీరని నష్టం.

250

ఒక పాతికేళ్ళ క్రింద విశాఖపట్టణంలో శ్రీ తెన్నేటి విశ్వనాథంగారి అధ్యక్ష్యత క్రింద నేనేదో ఉపన్యాసం చేశాను. అందులో కొన్ని ఖగోళ విషయాలు, కొన్ని వేదాంత విషయాలు, కొన్ని భూగర్భశాస్త్ర విషయాలు చెప్తుతూ ప్రధానంగా తత్త్వశాస్త్రాన్ని గురించి మాట్లాడినట్లున్నాను. నాకు సరిగా జ్ఞాపకం లేదు. ఉపన్యాసమంతా తెలుగులోనే జరిగింది. గంటన్నర మాట్లాడడమైనది. సభలోనుంచి చివరకు ఒక ప్రసిద్ధుడు, వృద్ధుడు అయిన న్యాయవాదిగారు లేచి నా వద్దకు "తెలుగులో ఇన్ని భావాలు ఇట్లా చెప్పడానికి వీలుందా?" అని ప్రశ్నపూర్వకంగా నన్ను ప్రశంసించారు. ఈ సందేహం ఆధునికులైన విద్యావేత్తలనందరను బాధిస్తుంది. నేను చాలసార్లు ఎందుకు వారిట్లా సందేహపడతారు అనుకున్నాను. విచారించాను. నాకు ఒక్కటే సమాధానం తోచింది. వాళ్ళు ఇంగ్లీషులోనే ఊహిస్తారు. ఇంగ్లీషునే వ్రాస్తారు. వాళ్ళకు ఇంగ్లీషు తప్ప తెలుగురాదు. అంటే వాళ్ళ బుద్ధులు ఇంగ్లీషులో వికసించినవి. తెలుగులో వికసించలేదు. వికసించిన ఏ పువ్వైనా దాని వాసన దానికి వుంటుంది. గాలి ఆ ఆ పరిమళాన్నే ప్రవహింప చేస్తుంది. "నేను ఇంగ్లీషులో కొన్ని పువ్వుల మీద గాలిని తీసుకువెళ్ళడమే ఎరుగుదును. తెలుగుదేశంలో పూలమీద గాలి ఎలా మోయవలెనో నాకు తెలియదు" అని గాలి అనదు. ఏ పరిమళాన్నైనా అది ప్రవహింపచేయగలదు.

251

మన చదువు దేశభాషలలో మార్చితీరవలె ననుకుంటే, మొదలుపెడితే పదేండ్లలో ఒక్క ఇంగ్లీషు శబ్దం వుండదు.

252

ఇంగ్లీషు మాట్లాడే వాళ్ళకు నూటికి 99 మందికి ఇంగ్లీషు సరిగా రాదు. జీవితమంతా ఇంగ్లీషులో మునిగి ఉంటే, ఇంగ్లీషు భాష సరిగా వారిలో నూటికి 99మందికి రాదు.

**End of Preview.**

**Rest of the book can be read @**

**http://kinige.com/kbook.php?id=750**

*  *  *

**Read other books by Dr. V. Kondal Rao@**

**http://kinige.com/kbrowse.php?via=author&id=164**